## క్లుప్తంగా

### మెరిట్ విద్యార్థికి రోటరీ క్లబ్ ల్యాప్‌టాప్ వితరణ



విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రోటరీ క్లబ్ రాజమండ్రి సిద్ధంగా ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు నాళం నరసింహరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహరావు, పూర్వపు అధ్యక్షుడు చింతా ప్రసాద రెడ్డి, లచ్చి రెడ్డి శ్రీనివాస్, నూలి శివ తదితర రొటేరియన్ల సౌజన్యంతో బీవీసీ కాలేజీలో బీటెక్ చదువుతున్న హర్షితకు నూతన ల్యాప్‌టాప్ బహూకరించారు. తండ్రి చనిపోయి, దృష్టిలోపం గల తల్లితో ఉంటూ ప్రతిభ కనబరుస్తున్న పేద విద్యార్థిని ప్రోత్సహించేందుకు ఈ చర్య చేపట్టినట్లు నరసింహరావు తెలిపారు. అసిస్టెంట్ గవర్నర్ పీవీ వీఎస్ దొరబాబు, కార్యదర్శి చంద్రశేఖర్, బూర్లగడ్డ సుబ్బారాయుడు, లంకలపల్లి శ్రీనివాస్, సుంకర నాగేంద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యదర్శిని సన్మానించిన పంచాయతీ సిబ్బంది



నూతన కార్యదర్శి వెంకట్రావును సన్మానిస్తున్న ధవళేశ్వరం పంచాయతీ సిబ్బంది

ధవళేశ్వరం: ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జి.వెంకట్రావును పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. శనివారం పంచాయతీ కార్యదర్శిగా వెంకట్రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వెంకట్రావుకు శుభాకాంక్షలు తెలిపారు. సమష్టి కృషితో గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళదామని పంచాయతీ సిబ్బందికి కార్యదర్శి వెంకట్రావు సూచించారు.

### బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన కార్యకర్తలతో సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేయడానికి సిద్ధపడి తమ పార్టీలోకి చేరుతున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో జిల్లా బీజేపీ కార్యాలయంలో రాజానగరం మండలం పాలచర్ల గ్రామానికి చెందిన బిందు భాస్కర్ ఆధ్వర్యంలో 30 మంది, రఘునాథపురం గ్రామానికి చెందిన శ్రీను ఆధ్వర్యంలో 20 మంది బీజేపీలో చేరారు. వీరికి ఆయన కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల రామకృష్ణ, రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి పాల్గొన్నారు.

### కార్తిక సమారాధనపై 27న సమావేశం



సమావేశంలో పాల్గొన్న నగర దేవాంగ సంఘం ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: నగర దేవాంగ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే కార్తిక వనసమారాధన కార్యక్రమంపై చర్చించేందుకు ఈ నెల 27వ తేదీన జాంపేట శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణ మంటపంలో సమావేశం నిర్వహిస్తున్నామని దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రొబ్బి విజయ్ శేఖర్ తెలిపారు. ఆదివారం కల్యాణ మంటపంలో సమావేశం నిర్వహించి తేదీ ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన దేవాంగ ప్రముఖులు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి కల్యాణ మండపం ఉపాధ్యక్షుడు వేమన మహేశ్వరరావు, నగర దేవాంగ సంఘ కోశాధికారి పడాల సూర్య కోటేశ్వరరావు, నగర దేవాంగ గౌరవ సలహాదారు పడాల వీరభద్రరావుల మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, రాష్ట్ర దేవాంగ అధాకార ప్రతినిధి కేకే సంజీవ రావు, గంపా సోమ లింగేశ్వరరావు, కొమ్మన వెంకటేశ్వరరావు, బళ్ళా సత్యనారాయణ, ద్వారా పార్వతి సుందరి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనానికి తూట్లు

- దెబ్బతింటున్న డివైడర్‌పై మొక్కలు
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది
- మాజీ ఎంపీ భరత్‌రామ్ హయాంలో పచ్చదనానికి పెద్ద పీట



జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులో పెద్ద మొక్కలు చనిపోవటంతో ఖాళీగా మారిన డివైడర్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం చేపట్టిన చర్యలను కొనసాగించడంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కారణంగా పచ్చదనానికి తూట్లు పడుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ నేతృత్వంలోనగరంలో పలు ప్రాంతాల్లో పచ్చదనానికి పెద్దపీట వేశారు. రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు డివైడర్లను అభివృద్ధి చేసి వాటిలో భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా పలు ప్రాంతాల్లో అవి చనిపోతున్నాయి. చనిపోయిన మొక్కల స్థానంలో మరొక మొక్కను నాటాల్సిన అధికారులు, సిబ్బంది చూసీచూడనట్టు వదిలేయడంతో పచ్చదనానికి మచ్చగా మారుతోంది. పచ్చదనానికి పెద్ద పీట వేస్తున్నామంటూ స్వచ్ఛ నగరంగా తయారు చేస్తున్నామంటూ నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్న మాటలు నీటిమూటలుగా మిగిలిపోతున్నాయి. రాజమహేంద్రవరం నగరంలో ఆనాల వెంకట అప్పారావు రోడ్డు, జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డు, తిలక్ రోడ్డు, పరమహంస యోగా నంద మార్గ్, లాలాచెరువు రోడ్డు, పేపర్ మిల్ రోడ్డు, అజాద్ చౌక్ రోడ్డు, నందం గనిరాజు జంక్షన్ రోడ్డు, స్వామి – అశోక థియేటర్ రోడ్డు, వీఎల్‌పురం రోడ్డు ఇలా 12 రోడ్లలో డివైడర్లపై లక్షలాది రూపాయల వ్యయంతో పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వాటిని సంరక్షించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు సరైన శ్రద్ధ చూపకపోవడంతో కొన్ని డివైడర్లపై నాటిన మొక్కలు చనిపోతున్నాయి. ఇలా చనిపోయే వాటిని తొలగించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 16వ డివిజన్‌లోని వాంబే గృహాల నుంచి జాతీయ రహదారి వరకు ఏర్పాటు చేసిన 100 అడుగుల రోడ్డులో సైతం మొక్కలు చనిపోతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో పచ్చదనానికి పెద్ద పీట వేస్తూ చేపట్టిన గత ప్రభుత్వపు అభివృద్ధి కార్యక్రమాలు ప్రస్తుత అధికారుల నిర్లక్ష్యంతో దెబ్బతినే ప్రమాదం నెలకొంది. నగరపాలక సంస్థ అధికారులు పచ్చదనాన్ని పెంపొందించేందుకు పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాల్సిన అవసరం ఉంది. మొక్కలను పూర్తిస్థాయిలో సంరక్షించే చర్యలు చేపట్టాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. డివైడర్లపై మొక్కలు పలు ప్రాంతాల్లో సంరక్షణ లేక దెబ్బతింటున్నాయని, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో పర్యావరణ పరిరక్షణార్థం ఏర్పాటు చేసిన మొక్కలను కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై నగర పాలక సంస్థ అధికారులను వివరణ కోరగా మొక్కల సంరక్షణ చర్యలు చేపడతామన్నారు.



జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులో చనిపోయిన మొక్క

#### పర్యావరణాన్ని కాపాడాలి



పర్యావరణ పరిరక్షణకు నగరంలో ఏర్పాటు చేసిన మొక్కలను సంరక్షించే బాధ్యత నగర పాలక సంస్థ అధికారులు నిరంతరాయంగా చేపట్టాలి. లక్షలాది రూపాయలతో చేసిన అభివృద్ధిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రభుత్వాలు మారినా అభివృద్ధిని కాపాడాల్సింది అధికారులే. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి.

– పులగం సుధారెడ్డి, రాజమహేంద్రవరం

#### పచ్చదనంతోనే సుందర నగరంగా తయారు



పచ్చదనాన్ని కాపాడటం వల్లనే నగరం సుందరంగా తయారు కాగలదు. నాటిన మొక్కలను కాపాడినప్పుడే పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుంది. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో నాటిన మొక్కలను కాపాడటంతో పాటు సుందరీకరణకు అధికారులు మరిన్ని చర్యలు చేపట్టాలి.

– దర్భ సుజాత, అడ్వకేట్, రాజమహేంద్రవరం

## ఉపాధ్యాయులకూ క్రమశిక్షణ అవసరం

డీఈవో వాసుదేవరావు



ఆదర్శ గురువులకు సత్కార కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యార్థులకు క్రమశిక్షణ అలవరిచే ఉపాధ్యాయులకు కూడా క్రమశిక్షణ ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న ఒక హోటల్‌లో నిర్వహించిన ఆదర్శ గురువులకు సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కీలక సూచనలు చేశారు. 'ఇంటి దగ్గర కంటే ఎక్కువ సమయం విద్యార్థి స్కూల్లోనే ఉంటాడు. రోజులో మెలకువగా ఉండే సమయంలో ఎక్కువ సేపు పాఠశాలలోనే గడిచిపోతుంది. అందువల్ల విద్యార్థుల రక్షణ బాధ్యత కూడా ఉపాధ్యాయులదే అని చెప్పారు. కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, పెద్దలపై గౌరవం కచ్చితంగా నేర్పాలని సూచించారు. ఇలా చేయాలంటే ఉపాధ్యాయులకు కూడా క్రమశిక్షణతో పాటు అది ప్రభుత్వ, ప్రయివేటు అనే తేడాలేకుండా పనిచేసే సంస్థ పట్ల గౌరవ భావం కలిగి ఉండాలన్నారు. తరగతి గదిలో పాఠం చెప్పేటప్పుడు విద్యార్థులకు ఉపాధ్యాయునికి మధ్య కనీసం ఆరడగుల దూరం ఉండాలని, ఏ ఒక్క విద్యార్థితో అందరి ముందు ప్రత్యేకంగా మాట్లాడడం వంటివి చేయకూడదన్నారు. ఒక ఉపాధ్యాయుడు ఎలా ఉండాలో నిబంధనలు ఉన్నాయి. వాటిని తప్పకుండా పాటిస్తే చాలు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో పనిలేదు అని డీఈవో వాసుదేవరావు స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో అక్కడక్కడా జరుగుతున్న కొన్ని ఘటనలు విద్యా వ్యవస్థకు మచ్చ తెస్తున్నాయన్నారు. ప్రభుత్వ స్కూలే కాదు, ఒక ప్రయివేటు స్కూల్లో ఏదైనా ఘటన జరిగితే ఆ సంస్థ నిర్మించుకున్న సౌధం కుప్పకూలిపోతుందన్నారు. అందుకే ఇటువంటి దురదృష్టకర ఘటనలు ఎక్కడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# అయ్యబాబోయ్ దోమలు

కానరాని ఫాగింగ్

కడియం: రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గంలోని ప్రజలు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క సీజనల్ వ్యాధుల భయం వెంటాడుతోంది. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు కూడా పొంచి ఉండడంతో వారి ఆందోళన మరింత పెరుగుతోంది. నివారణ చర్యలు అంతంత మాత్రంగానే చేపడుతుండడంతో దోమల ఉధృతి రోజురోజుకూ పెరిగిపోతోంది. ముఖ్యంగా రాత్రిపూట తక్కువ, పగలు అధిక ఉష్ణోగ్రతలతో విపరీత వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దోమల తీవ్రత భారీగా పెరుగుతోంది. ఆరుబైట నిలబడాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. దోమల కారణంగా డెంగీ, ఫైలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. జ్వరపీడితులను గుర్తిస్తే కనీసం ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనైనా దోమల నివారణ చర్యలు చేపట్టేవారు. అయితే ఇప్పుడు అటువంటి పరిస్థితులు కూడా కరువయ్యాయని పలు గ్రామాల్లోని ప్రజలు చెబుతున్నారు. భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోతోంది. ఇది దోమల ఉధృతి పెరగడానికి కారణమవుతోందని ప్రజలు అంటున్నారు. డ్రైనేజీలో సిల్టు తొలగింపు ప్రక్రియ కూడా మండలంలోని పలు గ్రామాల్లో పూర్తికాలేదు. దీంతో మురుగునీరు సక్రమంగా దిగువకు పారడం లేదంటున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలైన వేమగిరి, కడియపులంక, దుళ్ళ, కడియం తదితర గ్రామాల్లో ఫాగింగ్ చేసిన దాఖలాల్లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్ఫూర్తి సేవలను ఆదర్శంగా తీసుకోవాలి



వృద్ధురాలికి చీర, ఆహారాన్ని అందజేస్తున్న విష్ణు చక్రవర్తి

ధవళేశ్వరం: ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి, టీవీసీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తడాల విష్ణు చక్రవర్తి పేర్కొన్నారు. ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో తడాల చక్రవర్తి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తడాల విష్ణు చక్రవర్తి, రాజరాజేశ్వరి దంపతులు కేక్ కట్ చేసి, వృద్ధులకు చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్యాల పోసికుమార్ మాట్లాడుతూ దాతృత్వానికి మరో పేరుగా నిలిచే తడాల విష్ణు చక్రవర్తి జన్మదిన వేడుకలు స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తడాల కృష్ణకుమార్, సత్య, తడాల అర్జున్, భవాని, లక్ష్మీనారాయణ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

# కాలం చెల్లిన పాలకులతో ప్రమాదం

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్



రాజమహేంద్రవరం సిటీ: పాలన చేతకాని నాయకులు భక్తుల మనోభావాలతో రాజకీయాలు చేస్తున్నారని, ఇటువంటి కాలం చెల్లిన పాలకులతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు ప్రమాదం పొంచి వుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలో ఆర్పీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌కు పాలనా అవినీతి, పెత్తందారీ ఆధిపత్యం కారణంగా అభివృద్ధి శూన్యంగా మారిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన అనంతరం ఏ మాత్రం అభివృద్ధి లేకపోగా ఉపాధి మార్గాల కోసం ఆంధ్రులు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. ప్రపంచ బ్యాంక్ సైతం అమరావతి రాజధానిగా వద్దు అని చెప్పినా మొండిగా అమరావతినే రాజధానిగా ముందుకు కొనసాగించే ప్రయత్నం చేయటం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. సాక్షాత్తూ ప్రకృతే ఒక విపత్తుగా సాక్ష్యం ఇచ్చినా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మోదీ సర్కార్ ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే కుట్రలు చేస్తున్నా మన పాలకులు చోద్యం చూస్తున్నారన్నారు. కేజీ బేసిన్‌లో లక్షల సంపద దోపిడీకి కుట్రలు జరుగుతున్నా ఆంధ్ర పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర ఘోరంగా నష్ట పోతున్నా బాప్టిస్ట్ పవన్ కళ్యాణ్ కామెడీతో యువత దృష్టి మళ్లిస్తున్నారని విమర్శించారు.

# మాకు న్యాయం చేయండి

ఎమ్మెల్యే గోరంట్లకు మొర పెట్టుకున్న డ్వాక్రా గ్రూపు సభ్యులు



ఎమ్మెల్యే గోరంట్లకు మొర పెట్టుకుంటున్న కడియపులంక డ్వాక్రా గ్రూపు సభ్యులు

కడియం: తాము బ్యాంకులకు కట్టిన డబ్బులు గల్లంతయ్యాయని, న్యాయం చేయాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి కడియపులంక పంచాయతీ పరిధిలోని డ్వాక్రా గ్రూపు సభ్యులు మొర పెట్టుకున్నారు. తాము సక్రమంగా వాయిదాలు చెల్లించినప్పటికీ వాటిని బ్యాంకులకు చెల్లించడంలో సంబంధిత సిబ్బంది గోల్‌మాల్ చేశారన్నారు. తమ సంఘానికి సంబంధించి రూ.పదిలక్షల వరకు మాయమయ్యాయని, విచారణ చేస్తే ఇతర సంఘాల సభ్యుల సొమ్ము కూడా ఎంత అన్నది తేలుతుందన్నారు. ఈ మేరకు కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో గోరంట్ల కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారులకు మొర పెట్టుకున్నా కాలయాపన చేస్తున్నారు తప్పితే, తమకు న్యాయం జరగడం లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని డ్వాక్రా గ్రూపు సభ్యులు తెలిపారు.

### చెత్తకుప్పలో 'శై'శవం'



తుమ్మలావలో చెత్తకుప్పలో దర్శనమిచ్చిన శిశువు

కంబాలచెరువు: తల్లి ఒడిలో వెచ్చగా ఉండాల్సిన శిశువు చెత్తకుప్పల్లో మృతిచెంది దర్శనమిచ్చింది. రాజమహేంద్రవరం తుమ్మలావ ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికులను ఆవేదనకు గురిచేసింది. తుమ్మలావ ప్రాంతంలోని జయరామ్ థియేటర్ సమీపంలో చెత్తకుప్పలో పేగులు చుట్టుకుని పడి ఉన్న మృత శిశువును స్థానికులు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు తెలిపారు. వారు వచ్చి శిశువు మృతదేహాన్ని చూసి ఆరా తీశారు. శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# అష్టైశ్వర్య ప్రాప్తిరస్తు



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- నాలుగో రోజు శ్రీమహాలక్ష్మీదేవి అమ్మవారిగా దర్శనం
- దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తులు



అన్నపూర్ణాదేవి అలంకరణలో కాశీ అన్నపూర్ణ



మోరంపూడి సాయినగర్‌లో లలితా త్రిపురసుందరిదేవి అవతారంలో అమ్మవారు

సీటీఆర్ఐ: శరన్నవ రాత్ర మహోత్సవాలలో నాలుగో రోజు అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. దేవీచౌక్‌లోని బాలా త్రిపురసుందరిదేవి అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించడంతో భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. మంగళప్రదమైన దేవత మహాలక్ష్మీదేవి. జగన్మాత మహాలక్ష్మీ స్వరూపంలో దుష్ట రాక్షస సంహారాన్ని చేయడం ఒక అద్భుత ఘట్టం. మూడు శక్తుల్లో ఒకటైన మహాలక్ష్మీ అమితమైన పరాక్రమాన్ని చూపించి హాలుడు అనే రాక్షసుడిని సంహరించింది. లోకస్థితి కారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్మీగా వరాలను ప్రసాదించే అష్టలక్ష్మీ రూపమైన అమ్మవారిని మహాలక్ష్మీగా అలంకరించారు. మహాలక్ష్మీ అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం వల్ల ఐశ్వర్యప్రాప్తి, విజయం లభిస్తుందని భక్తుల విశ్వాసం. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలోని అన్ని అమ్మవారి ఆలయాలలో వివిధ రూపాలలో ఆదివారం అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే భక్తులు కుంకుమ పూజలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. స్థానిక బలరామపేటలో అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంతో అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని బాదం, సన్ ఫ్లవర్ గింజలతో అలంకరించారు. అక్షరకోటి గాయత్రీ పీఠం, శారద మఠం, శంకర మఠం, సరస్వతీ ఘాట్, శ్రీసారంగధరేశ్వర స్వామివారి దేవాలయం, ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవాలయం, ఉమా రామలింగేశ్వర దేవాలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు.

**లలితా త్రిపురసుందరి దేవి అవతారంలో....**

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయి నగర్‌లోని విజయకనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం అమ్మవారిని లలితాత్రిపురసుందరిదేవిగా అలంకరించినట్టు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో కుంకుమపూజలు నిర్వహించారు. బాలాజీపేటలో వేంచేసియున్న విజయకనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు దేవిగా దర్శనమిచ్చారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, వాసంశెట్టి సూర్యగణేష్, తలారిశ్రీనివాసరావు, సూరంపూడిప్రకాష్ పాల్గొన్నారు.

**వైభవంగా చండీహోమం**

కడియం: మండలంలోని వేమగిరి తోట సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం వద్ద శరన్నవ రాత్ర వేడుకల్లో భాగంగా ఆదివారం చండీ హోమం వైభవంగా నిర్వహించారు. పురోహితులు కొత్తూరి సతీష్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామంలో భవాని మాలాధారులు, పలువురు దంపతులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కలశ స్థాపన, గణపతి హోమం, రుద్రాభిషేకం, క్షీరాభిషేకంతో పాటు పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. లోక కల్యాణార్థం గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని చండీ హోమం నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.



వేమగిరితోటలో జరిగిన చండీహోమంలో పాల్గొన్న భక్తులు

## సినిమాలు



| | |
|---|---|
| శ్యామల | : దేవర |
| సూర్యమినీ | : దక్షిణ |
| సూర్యప్యాలెస్ | : దేవర |
| శివజ్యోతి | : రామ్‌నగర్‌బన్నీ |
| అనుశ్రీ | : స్వాగ్ |
| స్వామి | : జోకర్ |
| అశోక | : దేవర |
| రాజా | : దేవర |
| రంభ | : కలి |
| ఊర్వశి | : సత్యం సుందరం |
| మేనక | : మత్తు వదలరా-2, మిస్టర్‌సెలబ్రిటీ |
| కుమారి | : దేవర |
| అప్సర | : దేవర |
| **నామవరం** | |
| వివిఎస్.మహల్ | : దేవర |
| **ధవళేశ్వరం** | |
| మురళీకృష్ణ | : దేవర |
| **కడియం** | |
| వెంకటసూర్య | : దేవర |